ప్రాణిని సృష్టించిన శక్తి కూడా అనుభవించి ఆనందిస్తోంది గావును.

పూర్వం 'కీ' ఇస్తే పనులుచేసే బొమ్మలు అమ్మే వాళ్లు. ఓ పెద్ద పురుగు వుండేది ఓ షాపులో— అది బల్లమీద ఇటూ అటూ తిరుగుతూ వుండేది. ఓ అరగంటసేపటిదాకా. దానికి 'కీ' ఇవ్వడం చూడకుండా వుంటే, అదేదో పురుగనీ దాని ఇష్టప్రకారమే, దాని అవసరంకొద్దీ అట్లా తిరుగుతోందనీ అనుకుంటాము. కాని దాని చలనమంతా దాని ఏర్పాటులోనే నిర్దేశించారు. మనుషుల్ని చూసినకొద్దీ ఆ బొమ్మలు జ్ఞాపకం వొస్తాయి. ఏదో ఆలోచించామనీ, విప్లవాలు చేస్తున్నామనీ, నీతిగా వున్నామనీ, అవినీతిగా వున్నామనీ, వివేకంగా అవివేకంగా ప్రవర్తించామనీ, బడాయిలు పోతూ, దిగుళ్లుపడుతూ ఇట్లా బతుకుతారు గాని— అసలు ఎప్పుడో వీళ్లందర్నీ ఎవరో 'కీ' యిచ్చి లోకంలో వొదిలారు గావును. అంతకన్న అర్థం ఏమీ కనబడదు. నిజన్నా అర్థం వుంటే, ఈ బొమ్మల్ని చేసే ఓ బ్రహ్మో, శక్తో వుంటే, దాంట్లో వుండాలి అర్థం. అదీ చాలా అనుమానమయితే ఇంక ఎక్కడ వుంది ఓ అర్థం, అర్థం వుందని మాయపడే మనుషుల మనసుల్లో తప్ప- ఏదో చేస్తున్నామనే అహంభావపడే కార్యశూరుల హృదయావేశాల్లోకాక!

# మత్కుణోపాఖ్యానం

పూ. భా.

రకరకాల రంగురంగుల మానవుల రక్తాన్ని పీల్చి మరిగించిన మత్కుణాలు ప్రయాణాయాసంలో నున్నాసనైనా, ప్రియుల్ తప్పిపోయినాసనైనా సాంతు భూమి మాపక సూదులవంటి మూతులతో గుచ్చుతున్నాయి. ఎన్నో శతాబ్దాలనుండీ అంటే వాట్స్ దొరగారు స్ట్రీమ్ యింజన్ కనిపెట్టక పూర్వంనుంచీ ఉన్న మత్కుణకుటుంబాలు భారతదేశంలో అయోమార్గం వేయబడ్డ తరవాత కట్టబడ్డ స్టేషన్ చేరుకుని వంశపారంపర్యా అనుభవిస్తున్న తమ శాశ్వత హక్కుల్ని యీనాడు యీ మొగగాడు స్టేషన్లో వదులుకున్నాడని దయ తలుస్తూ ఊరుకుంటామా! సినీమాకదంబంలో చూపించినట్టు ఎగిరి పోతున్నాయి మాయ నల్లులు. ఆలోచించి చూస్తే జనమేజయ మహారాజువంటి శుద్ధ తెలివితక్కువ పెద్దమనిషి ఎవరూ కనిపించలేదు. లేకపోతే నిత్యం బాధపెట్టే యీ నల్లుల్ని వదిలేసి, ఎప్పుడో ఒకసారి తారసిల్లే పాములమీదకి పరిగెత్తేడు-'సర్పయాగం' అంటూ మత్కుణయాగం చెయ్యకూడదనూ తెలవి తక్కువా అని.

'మేష్టరుగారూ! నల్లులు యిలా చెలరేగుతూంటే మీరు తగినచర్య తీసుకోకపోవడం శోచనీయం' అన్నా అప్పుడే భోజనంచేసి వచ్చిన చిన్న మేష్టరుతో.

'నల్లులాండి!' చుట్ట ముట్టించి ప్రారంభించాడు. 'ఏమిటిచెయ్యడం సార్, యీ స్టేషన్నే చూసుకుంటామా, టిక్కెట్లే యిస్తామా, వచ్చే పోయే ప్రయాణీకుల్నే చూసుకుంటామా, ఎగ్రసి వచ్చని ఝూంటి బత్తీల్నే ఊపుతామా, యీ నల్లుల్నే చూచుకుంటామా. అందులో యీ యుద్ధం వచ్చిన [illegible], గోచిపాతరాయుడికి కూడా పని ఎక్కువైపోయిందంటే నమ్మండి. ప్రతివాడికీ పనే. అందులోనూ అర్జంటుపని. చివరికి రైలు మాడపిగాడుకూడా ఫస్టుక్లాసులోనికి తయారు. ఇంత శ్రమపడి చమటలు కక్కుకుంటూ వస్తే స్టాప్ బుకింగు. ఆ పెద్దమనిషి యింటిదగ్గరనుంచి తీసుకువచ్చిన నల్లుల్ని యిక్కడ దిగుమతి చేసి చక్కాపోతాడు...'

చిన్న మేష్టరెవడో ఘటికుడిలాగే ఉన్నాడు. యిన్నాళ్లకి అగ్నిహోత్రుడికి తగినవాడు దొరికాడని కరకట శాస్తుల్లు అన్నట్టు యిలా కబుర్లు చెప్పేవాడు చాలారోజులుకి కనుపించాడు,

ఆరిపోయిన చుట్టకి అగ్గిపుల్ల కొట్టి బుగ్గలతో గాలిమికొడుతూ చప్పుడు చేస్తున్నాడు.

'పాడుచుట్టలండి. కాల్చి తగలేద్దామన్నా కాలకుండా వున్నాయి. ప్రపంచం అంతా డీజనరేట్ అయిపోతున్నట్టు యీ పొగాకులోనూ నిర్జీవత్వం ఏర్పడి చివరకి ఫైర్‌ప్రూఫ్ అవుతోంది...'

మేస్టరు చెప్పింది నిజమల్లేవుంది. వెలిగించామంటే మసి అయిపోయేదాకా ఆరని కత్తెర సిగరెట్లుకూడా యీమధ్య మధ్యమధ్య ఆరిపోవడం మొదలెట్టాయి.

'ఏంచుట్ట' అంటూ విసిగిపోయి గిరవాటు ప్రారంభించాడు. 'ఎవడో నీరసించిన బక్కనాయన చుట్టినట్టున్నాడు. రేషన్‌బియ్యం తినేవాడికి అంతకన్నా ఎక్కువ బలం వస్తుందా ఏమిటి. అదేమిటో గాని పంతులుగారూ! ... మీరు పంతుళ్లేనాండి...కాకపోయినా ఫరవాలేదులెండి. యీ మధ్య పాశ్చాత్యులుకికూడా జ్ఞానోదయం అయి రినన్సియేషన్, డిటాచ్‌మెంట్ మొదలైన ముక్కల్ని పట్టుకుని ముక్కుమూసుకుని హక్స్లే ప్రభృతులు బ్రాహ్మణులమైపోయా మంటున్నారుట. అలాంటప్పుడు వేదవేదాంత విద్యానిలయమైన భారత దేశంలో బ్రాహ్మణుడికి తక్కువైనవాడు ఎవడూ వుండడనే నా నమ్మకం...'

కీ యిచ్చి వదిలేస్తే చాలన్నట్టుంది, మాస్టరు వరుస. మా లిస్టులో తప్పకుండా చేర్చుకోవలసిన మనిషల్లే వున్నాడు.

'అలాంటప్పుడు మీరు పంతులుగా రవడానికి అభ్యంతరం ఏముంది. పంతులుగారూ! యీ కంట్రోలన్న పేరు ఏ దుర్ముహూర్తాన వాడుకలోనికి వచ్చిందో కాని. ఏ వస్తువుని కంట్రోలనండి– చివరకి గోమయాన్నికూడా యింక అది ఏమైపోతుందో? చచ్చినా దొరకదు. ఇక రేషనంటారా- దాని పేరు బలంకూడా అలాగే అఘోరిస్తోంది. మీరు నమ్మినా నమ్మకపోయినా చెపుతున్నా-గుణంపురం నన్నాల్ని రేషన్ అనండి అవి అమాంతంగా చెత్తయి వూరుకుంటాయి. ఒకవిషయానికి అభినందించాలిలెండి. అజీర్ణవ్యాధి కాస్తఅణిగినట్టుంది, యీ రేషనింగు వచ్చాక.'

ఫ్లాస్కు తీసి 'టీ' నాకొక్కాస్త యిచ్చి తను కాస్త తాగాడు.

'పంతులుగారూ! యిక్కడి నల్లులకే మీరిలా అయిపోతున్నారే. మీ రెప్పుడైనా రంగురంగుల నల్లుల్ని చూశారా?'

ఇంతలో గంట మ్రోగితే లేచి వెళ్లి ఏదో భోగట్టా అందుకునివచ్చి కూర్చుని ప్రారంభించాడు. 'మీబండీ గంటలేటు. లేటుగా రావడం దానికి మామూలే లెండి. నే నీమధ్య ఫలానా స్టేషన్‌లో వుండేవాణ్ణి. ఆ స్టేషను కొత్తగా వేశారు లెండి. ఏరోడ్రోమ్‌కి చాలాదగ్గర. ఆకాశంలోంచి నేరుగా వూడిపడ్డ సైనికుల్ని రవాణా చెయ్యడమే ఆ స్టేషన్ పని. అక్కడుండేవండి నల్లులూ...పంచరంగుల నల్లులు. కేవలం విదేశాలనుండే వచ్చాయనుకుంటా నవరత్నాల్లా నిగనిగలాడుతూండేవి. అంతర్జాతీయ సైనికబృందం తీసుకువచ్చిన వనుకుంటా...'

'అయితే ఏ డీ. డీ. టీయో కొని ఎందుకు జల్లరండి మాస్టరుగారూ' అన్నా.

'మహానీయా! ఆ రహస్యాన్ని చెప్పమన్నారా. ఎవరికీ చెప్పనని మీరుమాత్రం హామీ యివ్వాలి. యుద్ధానంతర పునర్నిర్మాణంలో రైల్వేశాఖ రహస్య ప్రణాళికలో ఏం వుందంటే- యీ నల్లులున్నాయే, రైల్వేశాఖవారికి ఆప్తమిత్రములున్నూ, జీతం బత్తెం లేని నౌఖర్లున్నూట. ఎందుచేతనంటారా రైల్వేశాఖలో పనిచేస్తున్న బద్ధకస్థుల్నీ, సోమరిపోతుల్నీ పొడిచిపొడిచి మీపని మీరు సక్రమంగా చేసుకోండి అని హెచ్చరిస్తూంటాయిట. అంతే కాదు. నిద్రపోయి రైలు తప్పిపోకుండా ప్రయాణీకుల్నికూడా జాగ్రత్తలో వుంచుతాయట. అందుచేత నల్లులు మనశ్రేయోభిలాషులు అని ఆ రహస్య ప్రణాళికలో విస్పష్టంగా వుందిట.'

ఇంతలో తిరిగీ గంట మ్రోగింది.

'పంతులుగారూ! యింక టిక్కట్లు యిచ్చుకోవాలి' అని లేచాడు.

నేనూ టిక్కట్టు తీసుకుని యింతవరకూ వూసుపోయినందుకు సంతోషిస్తూ, ప్లాట్‌ఫారంమీద పచారుచేయడం మొదలెట్టాను.